ఏయూ విద్యార్థులకు సకల వసతులు

- నాడు.. నేడు స్ఫూర్తితో అభివృద్ధి పనులు
- సమతా, మమతా హాస్టళ్ల ఆధునికీకరణ


మరమ్మతుల తరువాత హాస్టల్ భవనం


హాస్టల్‌పై భాగంలో నిర్మించిన రీడింగ్ రూమ్


మరమ్మతులు చేసిన తరువాత హాస్టల్ టాయిలెట్స్


నూతనంగా విద్యార్థులకు అందించనున్న మంచాలు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నాడు–నేడు పథకం స్ఫూర్తితో ఆంధ్ర విశ్వవిద్యాలయం యాజమాన్యం వర్సిటీ హాస్టళ్ల స్వరూపాన్ని పూర్తిగా మార్చివేస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల హాస్టల్‌కు ఎంతమాత్రం తగ్గకుండా ఆధునికీకరిస్తోంది. సకల వసతుల కల్పన చేస్తున్నారు. తాజాగా ఏయూ సమతా హాస్టల్‌ను రూ.17.55 లక్షలతో, మమతా హాస్టల్‌ను రూ.16.72 లక్షల వ్యయంతో ఆధునికీకరించారు. ప్రస్తుతం విద్యార్థులకు ఉపయుక్తంగా రూ.6 లక్షలు ఖర్చు చేసి బెడ్‌లను సిద్ధం చేశారు. 60 గదులతో 180 మంది విద్యార్థులకు వసతి కల్పించే అవకాశం ఈ హాస్టళ్లలో ఉంది. ప్రస్తుతం 120 మంది విద్యార్థులు ఉన్నారు.

అధ్వాన స్థితి నుంచి.. అద్భుతం దిశగా..
న్యాయ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మమతా, సమతా హాస్టళ్లు ఉన్నాయి. దీర్ఘ కాలంగా వీటిని పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఈ భవనాలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ప్రస్తుత వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకస్మికంగా వీటిని గతేడాది సందర్శించారు. వాస్తవ పరిస్థితులను వెంటనే చీఫ్ ఇంజినీర్‌ను పిలిపించి యుద్ధ ప్రాతిపదికన హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ విభాగం అధికారులు తొలుత టాయిలెట్స్ బ్లాక్‌ను పూర్తిగా ఆధునికీకరించారు. టైల్స్ ఫ్లోరింగ్, టాయిలెట్స్ వంటివి కొత్తవి ఏర్పాటు చేశారు. హాస్టల్ గదుల్లో అవసరమైన మరమ్మతులు పూర్తిచేసి పెయింటింగ్ వేశారు. తలుపులు, కిటికీలకు ఎనామిల్ పెయింట్‌లు వేశారు. హాస్టల్ వెనక భాగంలో దెబ్బతిన్న ప్రాంతాన్ని మరమ్మతులు చేయడం, సన్‌షేడ్‌లు దెబ్బతిన్న చోట పునరుద్ధరణ పనులు చేపట్టారు.

నెల రోజుల్లో బెడ్‌లు సిద్ధం
గత నెలలో వర్సిటీ వీసీ స్వయంగా హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సమయంలో విద్యార్థులకు మంచాలు లేవని వీసీ దృష్టికి వచ్చింది. నెల రోజుల్లో విద్యార్థులకు మంచాలు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అయితే అంత కంటే ముందుగానే మంచాలను హాస్టల్ ప్రాంగణంలో తయారు చేయించి, విద్యార్థులకు అందించడానికి సిద్ధం చేశారు. దాదాపు రూ.6 లక్షల వ్యయంతో 120 మంచాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సాయంత్రం వేళలో చదువుకోవడానికి వీలుగా ఒక రీడింగ్ రూమ్‌ను సైతం నిర్మించి, ఫ్యాన్‌లు, లైట్‌లు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల్లో చాలా మార్పు వచ్చింది



హాస్టళ్లలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులు స్వయంగా చూస్తున్నారు. వీటిని స్వాగతిస్తూ సహకారం అందిస్తున్నారు. దీనికి నిదర్శనంగా వారు మెస్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు సిద్ధంగా ఉన్నాం.
– ఆచార్య జి.వీర్రాజు, లా హాస్టళ్ల చీఫ్ వార్డెన్

అడగకుండానే అన్నీ చేశారు



గతంలో వీసీ విజిట్ చేసిన సమయంలో స్వయంగా ఇక్కడ పరిస్థితులను చూసి స్పందించారు. మేము అడగకుండానే టాయిలెట్స్ బ్లాక్ మొత్తం మార్పు చేశారు. అదే విధంగా ప్రతి గదిలో అవసరమైన మరమ్మతులు పూర్తి చేపట్టి, పెయింటింగ్ వేశారు.
– పి.జగదీష్, న్యాయ విద్యార్థి

అన్నమాట నిలుపుకొన్నారు



గత నెలలో హాస్టళ్లను వీసీ సందర్శించారు. విద్యార్థులకు బెడ్‌లు లేక పోవడం, నేలపై పడుకోవడం ఆయన చూశారు. వెంటనే నెల రోజుల్లో బెడ్‌లు అందిస్తానని మాట ఇచ్చారు. నెల రోజుల కంటే ముందుగానే నాణ్యమైన మంచాలు తయారు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు.
– జి.వినోద్, న్యాయ విద్యార్థి

15వ వార్డులో 43 మందికి కొత్త పెన్షన్‌లు


లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో కొత్తగా మంజూరైన 43 పెన్షన్‌లను లబ్ధిదారులకు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారందరికి పథకాలను వర్తిస్తాయన్నారు. వార్డు వలంటీర్లతో సంప్రదించి పథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పారి గిరిబాబు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

అపోలోలో ముగిసిన విద్యా కార్యక్రమం

ఆరిలోవ: హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'హెర్నియా క్లినికల్ ఇమ్మర్షన్'విద్యా కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అపోలో ఆస్పత్రుల సర్జన్లు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా విశాఖ అపోలో సీవోవో రామచంద్ర మాట్లాడుతూ క్లిష్టమైన ఇంగ్వినల్, బొడ్డు కోత, హెర్నియా లాప్రోస్కోపిక్ సర్జరీల గురించి అవగాహన కల్పించామన్నారు. ఆయా సర్జరీలు ఏవిధంగా జరుగుతాయో స్క్రీన్‌ల ద్వారా ప్రదర్శించారన్నారు.

క్లుప్తంగా

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం


సూపరింటెండెంట్‌కు నగదు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం ఆదివారం నగరంలోని పిఠాపురం కాలనీకి చెందిన ఇమంది లక్ష్మీప్రసాద్ రూ. లక్ష విరాళం ఇచ్చారు. సంబంధిత విరాళాన్ని ఆలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు నగదురూపంలో అందజేశారు. దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్–2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట జోన్–2 ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు.

గంజాయి నిందితులకు రిమాండ్

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని పట్టుకున్న ఘటన శనివారం అర్ధరాత్రి దాటాకా జరిగిన విషయం తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఒడిశా కోరాపుట్ ప్రాంతానికి చెందిన కిలో కృష్ణ, కోరా అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు రామ్మూర్తిపంతులుపేటలో శనివారం ఆటోలో గంజాయి తరలించడానికి సిద్ధంగా ఉన్న సమయంలో కంచరపాలెం పోలీసులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి 34 కేజీల గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

సీతమ్మధార రైతుబజార్‌లో సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్


రైతుబజార్ ఈవో కొండబాబు అదుపులో ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం రైతుబజారు రద్దీగా ఉండటంతో అదే అదును చూసుకుని వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేస్తుంటే.. సెల్‌ఫోన్లు దొంగతనం చేశారు. దీంతో రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ క్రైం పోలీసులకు సమాచారమివ్వడంతో వారు రంగంలోకి దిగారు. ఇద్దరు యువకులను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనసేవ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పవన్, శ్రావణ్, శ్రీకాంత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ జన్మదిన వేడుకలు


శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

ఎంవీపీ కాలనీ: ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–12లోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక విద్యార్థుల సమక్షంలో వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంటరీ జాయింట్ సెక్రటరీ కండిపిల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో వంశీకృష్ణ కేట్ కట్ చేశారు. అనంతరం వారికి స్వీట్లు, చాకెట్లు పంపిణీ చేశారు. 150 మంది విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి , చొక్కర శేఖర్, సీలపు రమణారెడ్డి, పాండా శ్రీను, కేత ఆనంద్, రంగల అప్పారావు, దూళి రఘు, స్కూల్ వ్యవస్థాపకుడు కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో.
కొమ్మాది: రుషికొండ శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీవారిని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ దర్శించుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వంశీకృష్ణ అన్నారు. అంతరాలయంలో పూజలు అనంతరం టీటీడీ అర్చకులు వేద ఆశీర్వాదం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ క్రికెట్ టోర్నీ విజేత 'కెల్ల ఎలెవన్'



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం 13వ వార్డులో జరుగుతున్న వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో సుమారు రెండు వారాల పాటు ఈ పోటీలు జరిగాయి. నియోజకవర్గంలో 15 వార్డుల నుంచి 40 క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్‌లో తలపడ్డాయి. వాటిలో ఫైనల్‌కు చేరుకున్న కెల్ల ఎలెవన్ జట్టు, మద్దిలపాలెం ఎలెవన్స్ జట్టు ఆదివారం పోటీపడ్డాయి. కెల్ల ఎలెవన్ విజేతగా నిలిచింది. ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని విజేత జట్టుకు ట్రోఫీ, రూ.30 వేలు నగదు అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన మద్దిలపాలెం ఎలెవెన్ జట్టుకు రూ.20 వేలు, మూడో స్థానంలో నిలిచిన శ్రీకృష్ణాపురం టైగర్స్ జట్టుకు రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచి ఆర్‌కే బాయ్స్ జట్టుకు రూ.5 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించే ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, ముర్వల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, కెల్ల సత్యనారాయణ, పలు వార్డుల నాయకులు పాల్గొన్నారు.

భారతీయ ప్రాచీన వేదాల విజ్ఞానం ఆచరణాత్మకం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ
- కొనసాగిన శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు


పాల్గొన్న నగర భక్తులు


ప్రవచిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీకాలనీ: భారతీయ ప్రాచీన వేదాలు అత్యంత సుస్థిర, ఆచరణాత్మకమైనవని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రాచీన వేదాల్లో సుస్థిరమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. నేటి ఆధునిక యుగంలోని శాస్త్రవేత్తలు సైతం దీన్ని ధ్రువీకరించడం అభినందనీయమన్నారు. దాన్ని వెలికి తీసి పాటించడం ద్వారా ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్‌లు యాగాది క్రతువులు, ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రవచనాలతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను జరుగుతాయని శ్రీమాత భక్త బృందం సభ్యులు తెలిపారు. ఈ ప్రవచనాల కార్యక్రమంలో 1000 మందికి పైగా నగర భక్తులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో రేణుక యల్లమ్మ జాతర


అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవాలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు అధ్యక్షతన కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. కమిటీ ముఖ్య సలహాదారుగా వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌ను నియమించారు. జాయింట్ సెక్రటరీగా బడే నాగరాజును నియమిస్తూ తీర్మానించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణపై కమిటీ సభ్యులు చర్చించారు.

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

గోపాలపట్నం: క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుని కుటుంబ సభ్యులకు శోకం మిగిల్చిన ఘటన గోపాలపట్నం లక్ష్మీనగర్ ఈ బ్లాక్ నాలుగు కుళాయిల వద్ద చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ ముగ్దంపురం గ్రామానికి చెందిన ముత్యం నవీన్(23) మద్యం మత్తులో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. నవీన్ నగరంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి 1గంట సమయంలో వేరే మహిళతో మాట్లాడాల్సిన అవసరమేంటని భార్య నాగమణి నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య చిన్న పాటి గొడవ జరిగింది. ఆ తర్వాత భోజనం తీసుకు వచ్చేందుకు సమీపంలో ఉన్న తల్లి ఇంటికి నాగమణి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి తలుపులు వేసి ఉండడంతో తీయమని కొట్టింది. ఎంతకీ తీయక పోవడంతో స్థానికుల సాయంతో ఇంటి వెనుక తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూసే సరికి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే కిందకు దించి గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు గోపాలపట్నం పోలీసులకు సమాచారమందించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సంధ్యా వందనం


జోడుగుళ్లపాలెం తీరంలో సామూహిక సంధ్యా వందనం చేస్తున్న బ్రాహ్మణులు


తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: మాఘ పౌర్ణమి సందర్భంగా సంధ్యావందన అభ్యసన శిక్షణా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జోడుగుళ్లపాలెం తీరంలో బ్రాహ్మణులు సామూహిక సంధ్యావందనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా వారంతా సముద్ర స్నానం చేసి, పూజలు చేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధి కొల్వకొలను శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ లోక కల్యాణం కోసం సామాజిక కార్యక్రమాలలో భాగంగా బ్రాహ్మణులకు సంధ్యా వందనంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇక్కడ గాయత్రీ మంత్ర జపయజ్ఞములు నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

తీరంలో మాఘ పౌర్ణమి స్నానాలు
బీచ్ రోడ్డు: మాఘ పౌర్ణమి సందర్భంగా నగరవాసులు ఆదివారం తీరంలో సముద్ర స్నానాలు ఆచరించారు. సూర్యభగవానుడికి పూజలు చేశారు.

సాగరతీరం.. కోలాహలం





సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మాఘ పౌర్ణమితో పాటు ఆదివారం సెలవు కావడంతో నగరవాసులు ఆర్‌కే బీచ్‌కు పోటెత్తారు. పలువురు సముద్రంలో స్నానాలు చేశారు. కొందరు యువకులు వాలీబాల్ ఆడుతూ సరదాగా గడిపారు.
ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్

ముగిసిన సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రాం


వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు

ఆరిలోవ: విద్యార్థులకు ఆరోగ్యకరమైన విద్యాబోధన కోసం విశాఖ వేలీ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ×సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రాం×కార్యక్రమం ఆదివారం ముగిసింది. నగరంలో 30 సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన 80 మంది ఉపాధ్యాయులు ఈ వర్క్ షాపులో పాల్గొన్నారు. ఆదివారం రిసోర్స్ పర్సన్‌గా విశాఖవేలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ వ్యవహరించారు. ఇనీషియల్ మెంటల్ హెల్త్, గ్రోయింగ్ ఆఫ్ హెల్త్, న్యూటిషియన్ హెల్త్, శానిటేషన్, ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ సస్టయినబుల్, రీప్రొడక్ట్ ఆఫ్ హెల్త్, తదితర వాటి గురించి అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు. ఇవి ఉపాధ్యాయులు, విద్యార్థులు శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడానికి ఉపయోగపడతాయన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు 70 మంది ఎంపిక


జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికన వారితో జానకీరామ్

మహారాణిపేట: న్యూఢిల్లీలోని తలకట్టోర ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు 70 మంది క్రీడాకారులు ఎంపిక య్యారు. న్యూ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి 70 మంది ఎంపిక కాగా.. ఇందులో 50 మంది విశాఖ క్రీడాకారులే కావడం విశేషం. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీ మర పడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ పాల్గొని.. ఎంపికై న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ రాజధానిలో పతకాలు సాధించి.. రాష్ట్ర ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలకు జి.నూకరాజు, డి.ప్రేమ్‌కుమార్, ఎస్.సతీష్ కుమార్, ఎస్.నరేష్, శంకర్, ఎర్రయ్య, శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కోచ్ జి.గోవింద్, టీమ్ మేనేజర్ చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. నూకరాజు ఎంపికైన వారిని అభినందించారు.

నేరాల జోలికి పోవద్దు


ద్వారకా పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐలు సింహాద్రినాయుడు, శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ రౌడీ షీటర్ల దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని, కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని రౌడీ షీటర్లకు సీఐలు సూచించారు.